క్లుప్తంగా

అక్రమ మైనింగ్‌ను ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే


మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నియోజకవర్గంలో జరుగుతున్న ఘోరాలు, దాడులు, అవినీతి వ్యవహారాలపై స్పందించకుండా తాము గౌరవించట్లేదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తన అనుచరులతో చెప్పించడం హాస్యాస్పదంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తీవ్రంగా విమర్శించారు. శనివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, పేదల ఇళ్లు, పశువుల షెడ్లు బుల్డోజర్లతో కూల్చడం, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేయించడం, భార్యాభర్తల ఫొటోలను మార్ఫింగ్ చేయించడం వంటి అసభ్య, అవినీతి, బలప్రయోగ ఘటనలపై ఎన్నోసార్లు బహిరంగంగా చెప్పినా.. స్పందించని వ్యక్తులు గౌరవాన్ని ఎలా ఆశిస్తారని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో పేకాట క్లబ్బులు, బెల్ట్ షాపులు, అక్రమ మైనింగ్‌లను ప్రోత్సహిస్తున్న రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులు సంస్కారం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

బిక్కవోలు: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజమండ్రి కంబాల చెరువులోని ఎస్‌బీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో బిక్కవోలు మండలం కాపవరం ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వైబీఎస్ ఆచార్యులను జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా శుక్రవారం రాత్రి సత్కరించారు. ఈ మేరకు మండల విద్యాశాఖాధికారి తిరుమల దాసు శనివారం తెలిపారు. జిల్లా విద్యా శాఖ అధికారి వాసుదేవరావు సన్మానం నిర్వహించారు. ఆయనను ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ అధ్యక్షుడు రమణారావు, బ్యాంక్ మేనేజర్లు తదితరులు అభినందించారు.

వేంకటేశ్వరునికి పంచామృత అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రంగంపేట: మండలంలోని చంద్రేడులో కొలువైన పద్మావతి, అలివేలు మంగ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలి

పెదపూడి: క్లాప్ మిత్రాలు గ్రామాల్లో చెత్త సేకరణ బాధ్యతగా చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. శహపురంలో ఆయన శనివారం క్లాప్ మిత్రాలు చేస్తున్న చెత్త సేకరణ, పారిశుధ్య పనులు పరిశీలించారు. అలాగే గ్రామంలో అన్ని వీధులు పరిశీలించి క్లాప్ మిత్రాలు చెత్త సేకరణ ఏ విధంగా చేస్తున్నారో, ప్రజలు ఏ విధంగా చెత్త క్లాప్ మిత్రాలకు అందిస్తున్నారో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ, తడి, పొడి చెత్త వేరువేరుగా క్లాప్ మిత్రాలకు అందించడానికి ప్రజల్లో నిరంతరం చైతన్యం పెంచాలన్నారు. ఆరోగ్యవంతమైన, పరిశుభ్రమైన గ్రామాల నిర్మాణానికి అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

రెండు కళాశాలలకు ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్


ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య స్వామి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని బీవీ రాజు కాలేజ్ (భీమవరం), ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజ్ (రాజమహేంద్రవరం) ఎన్‌ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) 2025 ర్యాంకింగ్ సాధించాయని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి ఆయా కాలేజీల ప్రతినిధులకు శనివారం అందజేసి, అభినందనలు తెలిపారు.

పంటకు 'నానో' ప్రయోజనం

సీతానగరం: నానో యూరియా పంటలకు ఎంతో ఉపయోగకరమని మండల వ్యవసాయ శాఖాధికారి గౌరిదేవి అన్నారు. శనివారం చిన కొండేపూడి పీఏసీఎస్ వద్ద నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ కాండ్రు శేఖర్ పాల్గొన్నారు. మామూలు యూరియా కన్నా నేల, గాలి, నీటికి నానో యూరియా హానికరం తగ్గిస్తుందని, సమర్థంగా పని చేస్తుందని ఏవో తెలిపారు. చిరుధాన్యాలు, వరి, కూరగాయల వంటి అన్ని పంటలకు ఉపయోగించవచ్చన్నారు. పీఏసీఎస్ సీఈవో సుబ్బరాజు, రైతులు పాల్గొన్నారు.

స్కీమ్ రివర్సేనా..?

- ఊసులేని రివర్స్ పంపింగ్ స్కీమ్
- 25 వేల ఎకరాలను ముంపు నుంచి కాపాడే బృహత్తర పథకం
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో రూ.91.10 కోట్ల మంజూరు
- అయినా పట్టించుకోని కూటమి సర్కార్

సీతానగరం: సాధారణంగా ఎత్తిపోతల పథకాల్లో సాగునీటిని ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలిస్తుంటారు. ఏటా ముంపు సమస్యతో తల్లడిల్లుతున్న అన్నదాతలకు రివర్స్ పంపింగ్ విధానం ఓ వరంలా కనిపించింది. ఈ బృహత్తర పథకానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.కోట్లాది నిధులు మంజూరు చేసి.. టెండర్ల దశకు చేరినప్పటికీ.. ఎన్నికల కోడ్ అవరోధంలా మారింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పథకం కాస్తా అటకెక్కింది. వివరాల్లోకి వెళితే..

రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రివర్స్ ఎత్తిపోతల పథకానికి అద్భుత రూపకల్పన చేశారు. ఇందుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం.. వెనువెంటనే రూ.91.10 కోట్లు మంజూరు కావడం.. అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని టెండర్ల దశకు చేరడం చకచకా జరిగిపోయాయి. అనంతర పరిణామాలతో ఎన్నికల కోడ్ రావడంతో ఈ పథకానికి బ్రేక్ పడింది. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ పథకం ఊసే ఎత్తడం లేదు. స్థానిక ఎమ్మెల్యే దీనిని పట్టించుకున్న దాఖలాలూ లేవు. ఈ రివర్స్ ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఉన్న దాదాపు 25 వేల ఎకరాలు ముంపు సమస్య నుంచి గట్టెక్కుతాయి. సీతానగరం, కోరుకొండ మండలాల్లోని పొలాలకు ఏటా ముంపు సమస్య తప్పడం లేదు. బురద కాలువ నుంచి వచ్చే నీరు తొర్రిగెడ్డ కాలువలో కలిసి, బొబ్బిల్లంక స్లూయిజ్ ద్వారా గోదావరిలో కలుస్తుంది. ఏటా వస్తున్న ముంపు నుంచి విముక్తి కలిగేలా అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఈ ఆలోచన చేశారు.

కొండగోదారి కారణం!

దేవీపట్నం, రంపచోడవరం, కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో కురిసిన వర్షపు నీరు, సూరంపాలెం ప్రాజెక్ట్ నుంచి విడుదల చేసిన మిగులు జలాలు బురద కాలువ ద్వారా బొబ్బిల్లంక కాలువకు చేరి గోదావరిలో కలుస్తాయి. ఈ నీటినే కొండ గోదారిగా పిలుస్తారు. కొండ గోదారి నీరు గోదావరిలోకి వెళ్లే సమయంలో అఖండ గోదావరి వరద పోటెత్తి నీటిమట్టం పెరిగితే.. బొబ్బిల్లంకలోని స్లూయిజ్ తలుపులు ఆటోమేటిక్‌గా మూసుకుపోతాయి. కొండ గోదావరి ఎగపోటుతో నియోజకవర్గంలోని దాదాపు 25 వేల ఎకరాలు నీట మునిగి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవ

వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పొలాలు ముంపు బారిన పడకుండా బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టారు. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగెడ్డ కాలువపై రివర్స్ ఎత్తిపోతల పథకం నిర్మించి, గోదావరి వరద సమయంలో కొండగోదావరి నీటిని నదిలోకి ఎత్తిపోస్తే.. పొలాలు ముంపు నుంచి రక్షించవచ్చని ప్రతిపాదించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టిలో ఈ ప్రతిపాదనను ఉంచి రూ.91.10 కోట్లు మంజూరు చేయించారు. దీంతో సీతానగరం మండలం కూన వరం, రాపాక, చినకొండేపూడి, పెదకొండేపూడి, రఘుదేవపురం, ఉండేశ్వరపురం, బొబ్బిల్లంక గ్రామాలు, కోరుకొండ మండలంలో జగన్నాథపురం, గుమ్ములూరు, కాపవరం, బూరుగుపూడి, మునగాల గ్రామాల్లోని వేలాది ఎకరాలు ముంపు నుంచి బయటపడే ఆస్కారం ఏర్పడింది. రైతులకు పెద్దపీట వేశామంటున్న కూటమి ప్రభుత్వం రివర్స్ ఎత్తిపోతల పథకంపై కనీసం కన్నెత్తి చూడడం లేదు. బొబ్బిల్లంక స్లూయిజ్ సమీపంలో నెలకొల్పేందుకు ప్రతిపాదించిన ఈ రివర్స్ ఎత్తిపోతల పథకంపై స్థానిక ఎమ్మెల్యే ఇంత వరకూ దృష్టి సారించనే లేదు. ఇప్పటికే మంజూరైన ఈ పథకంపై ప్రభుత్వం శ్రద్ధ చూపాలని రైతులు కోరుతున్నారు.


బొబ్బిల్లంక తొర్రిగెడ్డ కాలువపై ఎత్తిపోతల పథకానికి ఉద్దేశించిన ప్రదేశం


రాపాక వద్ద కొండగోదారి ఎగపోటుతో ముంపులో పొలాలు (ఫైల్)

ముందుగా మిర్తిపాడు పొలాలే ముంపులోకి..



బొబ్బిల్లంక స్లూయిజ్ నుంచి ఎగపోటుగా వచ్చే కొండ గోదారి వల్ల మిర్తిపాడు ప్రాంత పొలాలే ముందుగా ముంపులోకి వెళతాయి. మరింత ఉధృతమైతే సమీప మండలాల్లోని పొలాలకు ముంపు తప్పదు. రివర్స్ పంపింగ్ స్కీమ్ మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రైతులకు ఎంతో మేలు చేసినట్టే. బొబ్బిల్లంక స్లూయిజ్ వద్ద తొర్రిగెడ్డ కాలువపై ఎత్తిపోతల పథకం నెలకొల్పి కొండగోదారి నీటిని ఎత్తిపోస్తే పొలాలకు ముంపు సమస్య ఉండదు.

– జొన్నలగడ్డ సత్యనారాయణ, మిర్తిపాడు, రైతు

ఈ పథకం పూర్తవుతుందా?



బొబ్బిల్లంక వద్ద నెలకొల్పే రివర్స్ పంపింగ్ స్కీమ్ కూటమి ప్రభుత్వంలో అవుతుందనే నమ్మకం లేదు. రైతులకు యూరియా అందించలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉంది. రోడ్లు కూడా వేయలేదు. రూ.కోట్ల విలువైన ఈ పథకం అవుతుందనే ఆశ రైతులకు లేదు. వాస్తవానికి రివర్స్ పంపింగ్ పథకంతో రైతులకు ఎంతో ఉపయోగం. ఇప్పుడు రామచంద్రపురం నుంచి మిర్తిపాడు, ఉండేశ్వరపురం వరకు పొలాలే కాకుండా, కోరుకొండ మండలంలోని పంటలూ ముంపునకు గురవుతున్నాయి.

– ముదునూరి రామకృష్ణంరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం, చినకొండేపూడి

అన్నదాతకు అండగా పోరాడుదాం


పార్టీ అనపర్తి కార్యాలయంలో అన్నదాత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు

అనపర్తి: రైతు సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించేందుకే ఈనెల 9న రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ సీపీ ఆందోళనలు చేపట్టనుందని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. అనపర్తి పార్టీ కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి 'అన్నదాత పోరు' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రైతులకు కనీసం యూరియాను కూడా అందించలేని అసమర్థ పాలనను చూస్తున్నామని మండిపడ్డారు. కృత్రిమ కొరతను సృష్టించి యూరియా బ్లాక్ మార్కెట్ దందాతో కూటమి నేతలు రూ.కోట్లు దండుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్మార్గమైన ఈ ప్రభుత్వం మెడలు వంచి, రైతులకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ నాయకత్వంలో గత ఐదేళ్ల పాలనలో స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో ఎప్పుడూ లేని విధంగా వ్యవసాయ రంగంలో వినూత్న మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు విజయ కుమారి, ఎంపీటీసీ సభ్యుడు కొండేటి భీమేష్, స్టేట్ ఎస్సీ సెల్ నాయకుడు తిరగటి శివ, ఎంపీటీసీలు తుమ్మ సత్తిబాబు, రాజేశ్వరి, వార్డు సభ్యులు, బీసీ సెల్ నాయకులు, సోషల్ మీడియా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలో జరిమానాలు


ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

రాజానగరం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) ద్వారా మండలంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సిబ్బంది పై రూ.28 వేలు జరిమానా పడింది. అలాగే రూ.2,43,223 రికవరీ చేయాలని ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా చేపట్టిన 1,375 పనులకు రూ.12,03,21,228, కాగా 96 సీసీ రోడ్లకు రూ.5,93,79,841, పది డ్రెన్లకు రూ.4,52,344 నిధులు ఖర్చు చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ మండారపు సీతారత్నం అధ్యక్షతన శనివారం ప్రిసైడింగ్ అధికారి బి.రాంప్రసాద్, జిల్లా విజిలెన్స్ అధికారి కె.రత్నకుమారి, సామాజిక తనిఖీ అధికారి గౌరీశంకర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. అభివృద్ధి పనులు జరిగిన ప్రాంతాలలో కొలతలు తీయడంలోను, గణాంకాలు సేకరించడంలోను గుర్తించిన తప్పులకు క్షేత్ర సిబ్బంది నుంచి రూ.2,43,223 రికవరీ చేయాలని ఆదేశించారు. కూలీలకు మస్టర్లలో సరిదిద్దుడు కార్యక్రమాలకు పాల్పడిన వారికి రూ.28 వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, హెచ్ఆర్ మేనేజర్ డి.నరేష్, ఏరియా కోఆర్డినేటర్ మారుతి, ఏపీఓ యు.భ్రమరాంబ, ఈసీ ఎం.బాలరాజు, పంచాయతీరాజ్, హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


బొబ్బిల్లంకలో రామకృష్ణ, ఇతర ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు ఉల్లి రామకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న సందర్భంగా హెచ్ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రామకృష్ణను సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మిగిలిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేరిమాత, సీఎస్ఆర్ మూర్తి, వి.సుబ్బలక్ష్మి, జేఎస్ మోహనరావు, రేష్మ, పాపారత్నం, మాచారమ్మ, సత్యనారాయణ, రత్నప్రసాద్, ప్రాథమిక స్కూల్ హెచ్ఎం దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకున్న ఉమామహేశ్వరి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరీదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అందుకున్నారు. రాష్ట్ర రాజధానిలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవం వేడుకల్లో ఆమె ఈ అవార్డును అందుకున్నారని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు.

మునికూడలిలో ఘర్షణ

- ఏడుగురు చినకొండేపూడి వాసులకు తీవ్ర గాయాలు
- పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయింపు



సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించిన ఆందోళనకారులు

సీతానగరం: మండలంలోని మునికూడలిలో వినాయకుని విగ్రహ నిమజ్జనానికి వెళ్లిన చినకొండేపూడికి చెందిన వారికి, మునికూడలికి చెందిన వారి మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. చినకొండేపూడికి చెందిన ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తమకు న్యాయం చేయాలంటూ సీతానగరం పోలీస్ స్టేషన్ వద్ద చినకొండేపూడికి చెందిన సుమారు 300 మంది బైఠాయించారు. చర్చల అనంతరం పోలీసులు వారిని రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. చినకొండేపూడికి చెందిన వారు విగ్రహ నిమజ్జనానికి మునికూడలి వెళ్లారు. రెండు కార్లపై వెళుతున్న వారు మునికూడలిలో అతి వేగంగా ఒకరిని ఢీకొట్టబోయారు. దీనిని గమనించిన అక్కడున్న పీఏసీఎస్ చైర్‌పర్సన్ సానిపిని వెంకట రామారావు ఆ కారుని నిలిపి మందలించారు. ఈ క్రమంలో వాగ్వాదం కాస్తా కొట్టుకునే వరకు పరిస్థితి వెళ్లింది. మునికూడలికి చెందిన స్థానికులు అధిక సంఖ్యలో చేరడంతో కారులో ఉన్న వారు పరారయ్యారు. కాగా నిమజ్జనంలో ఉన్న చినకొండేపూడికి చెందిన కొందరు ఈ విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. అప్పటికే చినకొండేపూడికి చెందిన కర్రిపతి హేమసుందర్, చిట్టాల బాబి, పేమహర్ష, కంచర్ల సన్నీ, మేడిశెట్టి బాల, వరద దుర్గాప్రసాద్, మేడిశెట్టి తేజ తీవ్ర గాయాలతో ఉన్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో.. ఎస్సై డి.రామ్‌కుమార్ తన సిబ్బందితో లాఠీచార్జి చేసి అల్లరిమూకలను చెదరగొట్టారు. అనంతరం గాయాలతో ఉన్నవారితో పాటు చినకొండేపూడి గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని, తమను కొట్టిన వారిని అరెస్ట్ చేయాలంటూ బైఠాయించారు. ఎస్సై రామ్‌కుమార్, ట్రైనీ ఎస్సై సురేష్ వారితో చర్చించారు. కోరుకొండ సీఐ సత్యకిషోర్ అక్కడకు తరలివచ్చారు. రాజమహేంద్రవరం నుంచి స్పెషల్ ఫోర్స్ కూడా దిగింది. ఎమ్మెల్సీ తర్వాత కేసు నమోదు చేస్తామని చెప్పడంతో, గాయాలపాలైన వారిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ సత్యకిషోర్ తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథుడు

- కన్నుల పండువగా గణేశుని ఊరేగింపు
- వాడవాడలా నిమజ్జనాల సందడి


పందలపాకలో గణేశుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

పెదపూడి: వినాయక చవితి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా 9 రోజులపాటు పూజలందుకున్న గణనాథులను శనివారం నిమజ్జనం చేశారు. వాడవాడలా సందడిగా నిమజ్జనోత్సవాలు జరిగాయి. మండలంలోని గామాల్లో గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పెదపూడి, జి.మామిడాడ, సంపర, పెదపూడి, చింతపల్లి, దోమాడ, కరకుదురు గ్రామాల్లో గణనాథుని నిమజ్జనం కార్యక్రమం భక్తులు చేపట్టారు. భక్తులు వివిధ వేషధారణతో చేపట్టిన నిమజ్జనం ఉరేగింపు అందరిని అకట్టుకుంది. ఉరేగింపులో గణనాథుడికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమీప పెద్ద కాలువల్లో నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై సీతారామ్ ఆధ్వర్యంలో పోలీసులు, వీఆర్వోలు, పంచాయతీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

బిక్కవోలు: మండలంలో మొత్తం 89 చోట్ల వినాయక మండపాల్లోని గణనాథులను నిమజ్జనం చేశారు. బిక్కవోలులోని పెద్ద కాలువలో, కొమరిపాలెం, తొస్సిపూడి, పందలపాక, కొంకుదురు గ్రామాల్లో వారు తుల్యభాగ నది, కాలువల్లో నిమజ్జనం చేశారు. అలాగే ఊలపల్లి, ఆరికరేవుల, బలభద్రపురం, ఆర్ఎస్‌పేట, కాపవరం, మెల్లూరు, రంగాపురం, ఇలపల్లి తదితర గ్రామాల్లో నిమజ్జనం చేశారు. ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేకంగా క్రేన్‌లు ఏర్పాటు చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు.

లడ్డూల ద్వారా రూ.2.13 లక్షల ఆదాయం

మండలంలో కొలువైన శ్రీలక్ష్మి గణపతి స్వామి ఆలయం లడ్డు వేలంపాట శనివారం నిర్వహించారు. గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన లడ్డును సోమేశ్వరానికి చెందిన నిమ్మకాయల శివశంకర్ రూ.1.25 లక్షలకు పాట దక్కించుకున్నారు. అలాగే ఇదే ఆలయం వద్ద రంగంపేట వారు సమర్పించిన లడ్డూకు నిర్వహించిన వేలం పాటలో విజయవాడకు చెందిన పర్వత్‌సింగ్ రూ.66,666కు దక్కించుకున్నారు. అలాగే జి.మామిడాడ గ్రామం వారు సమర్పించిన లడ్డూకు నిర్వహించిన వేలం పాటలో బిక్కవోలుకు చెందిన నేతేటి అరుణ్‌కుమార్ రూ.22,222కు దక్కించుకున్నారు. లడ్డూ వేలంపాట ద్వారా ఆలయానికి సుమారురూ.2.13 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ సిబ్బంది తెలిపారు. మండలంలోని తొస్సిపూడి గ్రామం కొత్తపేటలో ప్రసిద్ధి చెందిన లక్ష్మీ వర సిద్ధి వినాయక స్వామి లడ్డూకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మల్లిడి ఆంజనేయరెడ్డి రూ.11,500 లడ్డు దక్కించుకున్నారు. అనంతరం గణేష్ ఊరేగింపు నిర్వహించి, నిమజ్జనం చేశారు.

రంగంపేట: గణపతి బప్పా మోరియా అన్న నినాదాలు రంగంపేట మండలంలోని పురవీధుల్లో మార్మోగాయి. డప్పు వాయిద్యాలు, డీజే సౌండ్ల హోరు, చిత్ర విచిత్ర వేషధారణలు, తీన్‌మార్‌తో యువకుల నృత్యాల నడుమ శనివారం వినాయక నిమజ్జనాలు సాగాయి. రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, వడిశలేరు, కోటపాడు, మర్రిపూడి, సింగంపల్లి, నల్లమిల్లి, దొంతమూరు, దొడ్డిగుంట, వెంకటాపురం, సుభద్రంపేట, ముకుందవరం, వీరంపాలెం, ఈలకొలను, ఎస్టీరాజాపురం తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నెలకొల్పిన గణనాథుల నిమజ్జనాన్ని ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. కొందరు స్థానిక చెరువుల్లో నిమజ్జనాలు జరపగా.. మరికొందరు రాజమహేంద్రవరం గోదావరిలో నిమజ్జనాలకు తరలివెళ్లారు. అంతకుముందు ఆయా మండపాల వద్ద లడ్డూ వేలాన్ని కోలాహలంగా నిర్వహించారు.

పెద్దఎత్తున నిమజ్జనాలు

అనపర్తి: మండల వ్యాప్తంగా నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు శనివారం పెద్దఎత్తున జరిగాయి. ఉత్సవ కమిటీలు, యువత ఆధ్వర్యంలో కోలాహలంగా వినాయకుల విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అనపర్తిలో పాత ఊరు బాపనమ్మ ఆలయం వెనుక ఆనందనగర్ గణపతిని జేసీబీపై అందంగా అలంకరించి ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. అలాగే రామవరం, పొలమూరు, పీరారామచంద్రపురం, కొప్పవరం, కుతుకులూరు, ఎల్ఎస్‌పురం, పులగుర్త, పెడపర్తి తదితర గ్రామాల నుంచి భారీగా విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

లడ్డూల వేలం

వినాయక లడ్డూ ప్రసాదాలను భక్తులు పోటాపోటీగా దక్కించుకున్నారు. శేషగిరిరావుపేట సాయిరాం మందిరంలో 18 కిలోల లడ్డూ ప్రసాదాన్ని పి.కళ్యాణ్‌రెడ్డి, ధనలక్ష్మి దంపతులు, సురేష్ రెడ్డి, కవిత దంపతులు లక్కీ డ్రాలో దక్కించుకున్నారు. అలాగే మార్కండేయపురం వినాయకుని లడ్డూని బండారు శ్రీనివాసరావు రూ.21 వేలకు దక్కించుకున్నారు.

గ్రామాల్లో ఊరేగింపులు, నిమజ్జనాల సందడి

కోరుకొండ: మండలంలోని అనేక గ్రామాల్లో గణనాథుని ఊరేగింపులు, నిమజ్జనాలతో శనివారం సందడి ఏర్పడింది. బూరుగుపూడి, కోరుకొండ, శ్రీరంగపట్నం, గుమ్ములూరు. కోటికేశవరం, కోటి, దోసకాయలపల్లి, గాడాల తదితర గ్రామాల్లో గణేశ్ ఊరేగింపులు, నిమజ్జనాలు జరిగాయి. నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ సత్యకిషోర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎనిమిదో తేదీన నవరాత్ర ఉత్సవాలు ముగియనుండటంతో ఊరేగింపులు జోరందుకున్నాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, తీన్మార్, డప్పు వాయిద్యాలతో ఊరేగింపులు నిర్వహించారు. గాడాల శ్రీవినాయక వెంకటసాయి ఆలయం, కోరుకొండ, బూరుగుపూడి విఘ్నేశ్వర స్వామి దేవాలయాల వద్ద ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగాయి.

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను అధిక సంఖ్యలో నిమజ్జనం చేశారు. మునికూడలి రేవులో పడవపై విగ్రహాలను ఎక్కించి, గోదావరిలో నిమజ్జనం చేశారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ, కోరుకొండ సీఐ సత్యకిషోర్, ఎస్సై డి.రామ్‌కుమార్ పర్యవేక్షించారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, ముగ్గళ్ల, బొబ్బిల్లంక రేవుల్లో నిమజ్జనాలు జరిగాయి. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద దుర్గభవాని ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది.


పెదపూడిలో గణనాథున్ని ఊరేగిస్తున్న భక్తులు


సంపరలో తుల్యభాగ నదీపాయ వద్ద గణేశుని విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు


రంగంపేటలో ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్తున్న గణపయ్య


కోరుకొండలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు


మునికూడలి రేవులో విగ్రహాలను పడవలోకి ఎక్కిస్తున్న భక్తులు